# ఒక స్మృతి - ఒక గతి

ఉత్తరాలు.... గుట్టలు గుట్టలుగా పడివున్న ఉత్తరాలు. చిట్టి పర్వతాల్లా-చిన్ని సరసుల్లా వున్నాయి. ముప్పై యేళ్ళ జీవన సారాన్నంతా నింపుకున్న ఉత్తరాలు.

వీటినిట్లా పోగుచేసుకోటానికే జీవించానా యిన్ని సంవత్సరాలు!

ఇల్లిల్లూ మోసుకు తిరగటానికే జీవించానా యిన్నాళ్ళూ-అన్నట్టుగా భద్రపరిచిన ఉత్తరాలు.

ఇన్నాళ్ళూ స్వంతయిల్లనేది లేదు. తను పుట్టిన సంవత్సరమే నాన్న పల్లెటూళ్ళో వున్న యిల్లు స్కూలు భవనం కోసం యిచ్చేసి పట్నం వచ్చేశాడు. ఆడపిల్లల్ని చదివించుకోవాలనే కోరికా, బలమైన రెండు చేతులు, గుండెనిండా ధైర్యం వీటిని ఆసరా చేసుకుని పట్నం వచ్చేశాడు నాన్న. స్వంత యిల్లు కావాలని ఒక్కనాడూ అనుకోలేదు. ఆ పట్నంలో ఉన్న యిరవై ఒక్క సంవత్సరాల కాలంలో పది యిళ్ళన్నా మారి వుంటాం. అందులో నాలుగైదు ఇళ్ళు ఈ ఉత్తరాలు రాయటం మొదలుపెట్టిన తర్వాత మారాం.

ఇల్లు మారిన ప్రతిసారీ ఉత్తరాలు పూలమాలల్లా కలిపి కట్టేదాన్ని- కట్టేటపుడు మల్లెలు, మరువాలు, సన్నజాజులు, కనకాంబరాలు కలిపి కట్టినట్లు ఒక్కోరకం వుత్తరాలు ఒక్కోరకంగా కలిపి కట్టడం-అపుడు మళ్ళీ ఆ సుగంధాలను తాజాగా ఆస్వాదించడం-స్నేహితులమీద ప్రేమతో ఉక్కిరిబిక్కిరవటం. కట్టలన్నీ పాతసూట్‌కేసుల్లో భద్రంగా పదిలపరచి, కొత్త యింటికి స్వయంగా మోసుకెళ్ళి, వాటికో మంచిచోటు వెతికి, అక్కడ వాటిని పసిపాపల్ని నిద్రబుచ్చి వుయ్యాలలో పడుకోబెట్టినట్లు పెట్టేదాన్ని!

రాను రానూ స్నేహితులు పెరిగారు. వుత్తరాలూ పెరిగాయి.

జీవితంలోని ప్రతి దశకూ, ప్రతి సందర్భానికీ సాక్ష్యంగా నిలిచిన ఉత్తరాలు. పదిహేనేళ్ళ వయసులో యెంతో అమాయకంగా మొదలుపెట్టాను ఈ ఉత్తరాల సాగు.

ఊళ్ళో వుండి ఉత్తరాలు రాసుకోవటమేమిటని అందరూ నవ్వుతున్నా తనూ, శాంతీ వారానికి రెండైనా రాసుకునేవారు.

ముత్యాల్లాంటి శాంతి అక్షరాలు, యిప్పుడు పాతవై పొగచూరినట్లున్న కాగితాల మీద కూడా మెరుస్తున్నాయి.

బాల్యం వీడి-తొలి యవ్వనపు రోజుల కలలు-

ఏదో చేయాలనే, ఆదర్శంగా బతకాలనే, మంచిగా, స్నేహమే లోకంగా జీవించాలనే కలలే శాంతి ఉత్తరాల నిండా. ఆ కోరికలు యెంత నిర్మలంగా, స్వచ్ఛంగా జీవజలధారల్లా

బైటికొచ్చాయో- అది మానవులుగా యెదిగేటపుడు యెదురయ్యే గొప్ప వెలుగు. ఆ వెలుగు దివ్వెలు శాంతి వుత్తరాలు. వాటిలో లోకంమీద విమర్శ లేదు. ఎవరినీ ఆడిపోసుకోవటం లేదు. నిందలూ, నిష్టూరాలూ లేవు. అనవసరపు దుఃఖాలూ, అరుపులూ, ఆక్రోశాలూ లేవు.

లోకంలో ప్రతి విషయం గురించీ ఆనందం, ఆశ్చర్యం, అద్భుతం. వీటిని పంచుకోటానికి మనలాంటి మరో లేత గుండె. ఆ గుండెల చప్పుళ్ళ లయలోని మాధుర్యం- యింకా యిప్పటికీ శ్రవణకుహరాలను స్పృశిస్తూనే వుంది, ఆ వెలబారిన పాత కాగితాల రెప రెపల్లోంచి.

ఆ తర్వాత రెండు పెద్ద పెట్టెల్లో రాజశేఖర్, సుధాకర్‌ల ఉత్తరాలు. ఇద్దరూ అతి మంచివాళ్ళు. రాజశేఖర్ మెడిసిన్ చదువుతుండేవాడు. సుధాకర్ చిన్న వయసులోనే చదువు ఆపేసి వ్యాపారంలోకి దిగాడు. విశాఖ నుంచీ, తణుకు నుంచీ వచ్చే ఆ ఉత్తరాలలో తన మీది వాళ్ళ స్నేహ పరిమళం. ఆ పరిమళానికి ఒక అర్థం యివ్వాలనే ప్రయత్నం యెవరూ చేయలేదు. అడవి పూల పరిమళం. తను వాళ్ళకు రాసేది-అపుడపుడే తనలో చెలరేగుతున్న విప్లవ భావాలను. విద్యార్థి సంఘాల గురించీ, సమ్మెల గురించీ, వాటిలో ఖంగున మోగే తన గొంతు గురించి-మొదటిసారి విని రోమాంచితైన తరిమెల నాగిరెడ్డి వుపన్యాసం గురించి: తనతోపాటు రాత్రింబవళ్ళూ తిరుగుతున్న స్నేహితుల గురించి-

అమ్మానాన్నలు తనకిస్తున్న సహకారం గురించీ-

తను రోజు రోజూ చదువుతున్న కొత్త కొత్త పుస్తకాల గురించీ- అవి తనలో కలిగిస్తున్న అలజడి గురించీ-రాసేది.

ఉప్పొంగే తన రక్త ప్రవాహపు చప్పుడ్ని అక్షరాల్లోకి మార్చి వాళ్ళకు పంపేది. ఐదేళ్ళు! ప్రతిరోజూ ఒక ఉత్తరం!

సుధా-రాజా-ఏం చేశారా ఉత్తరాల్ని?

నా ఆలోచనల్ని మీతో పంచుకునే తీరిక నాకు లేనట్లుగానే, వినే ఓపిక మీకూ పోయింది. మీ పెళ్ళిళ్ళు, కొత్త జీవితాలు, పిల్లలు. నా వుత్తరాలనిట్లా యిల్లిల్లూ, వూరురూ మోసుకుంటూ తిరిగారా?

ఇరవై యేళ్ళ వయసు నుంచీ యింకో పది పెట్టెల ఉత్తరాలు.

ఆంధ్రదేశమంతా వీచిన ఝంఝూ మారుతంలో కొట్టుకుపోయిన జీవితం. నా అస్తిత్వానికి సాక్ష్యంగా నిల్చే ఈ ఉత్తరాలు.

శ్రీశ్రీ నుంచీ, కొడవటిగంటి కుటుంబరావు నుంచీ, యెవరో ముఖం కూడా తెలియని

వ్యక్తుల వరకూ రాసిన వుత్తరాలు.

ఉద్యమాల వేడితో జ్వలించేవి-

రాజకీయ చర్చలతో రగిలిపోయేవి.

సాహిత్య వాదవివాదాలతో ఉక్కిరిబిక్కిరయ్యేవి.

విమర్శలతో గుచ్చుకునేవి.

దుఃఖాన్నీ, అలజడినీ, ఆనందాన్నీ మోసుకొచ్చేవి.

ఏం చెయ్యాలి వీటిని?

పౌరహక్కుల నినాదాలతో గొంతులు పగిలి కారిన రక్తపు రుచీ, వాసనా నింపుకున్న ఉత్తరాలు.

చర్చలతో నిద్రలేని రాత్రులలో మెరుపెక్కిన కళ్ళ అరుణిమను పులుముకున్న ఉత్తరాలు.

నిర్బంధపు జైలు గదుల్లోంచి స్వేచ్ఛా పవనాలను విసిరిన వుత్తరాలు-

ఆ ఉత్తరాల్ని చూస్తుంటే అపారమైన దుఃఖం గుండెలోతుల్లోంచి తన్నుకొస్తోంది.

మిత్రులారా-ఎన్ని కలలు కన్నాం!

ఈ ప్రపంచాన్ని మార్చెయ్యాలనే ఆశతో, విశ్వాసంతో మనం యెట్లా జీవించాం-యెట్లా వూపిరి పీల్చాం.

ప్రతి క్షణం, ప్రతి రోజూ ఒక వుద్వేగ భరిత సందర్భం.

మరో ప్రపంచం మన చేతుల మీదుగా నిర్మిస్తామనే ఆవేశపు, ఆవేగపు ఆ ఉత్తరాలు....

ఇపుడీ వుత్తరాలను యేం చేసుకోను?

ముప్ఫై సంవత్సరాలుగా మోసుకుని తిరుగుతున్నాను.

నిరాశలను మూటగట్టుకుని తిరుగుతున్నాననుకోలేదు.

ఫలించని ఆశలు, కలలూ కాక జీవితం యేమిటిలే అనుకున్నాను. చనిపోయిన మిత్రుల జ్ఞాపకాలను, గుండెలమీద పిల్లవాడిని మోస్తూ జోకొడుతున్న తల్లిలా మోస్తున్నాను.

ప్రేమ, విప్లవం, వుద్యమం, మరణం మూటగట్టినట్లున్న ఉత్తరాలు.

ఏం చెయ్యను వీటిని?

నేను చివరిసారిగా పాతవుత్తరాలను చదువుదామనుకుని యెంత కాలమైంది?

ఆ రోజు నాకు బాగా గుర్తుంది. జ్ఞాపకంతోనే మనసు కలచివేసే రోజు.

ఐదారేళ్ల క్రితం అనుకుంటాను.

మళ్ళీ ఇల్లు మారాం. సామాన్లు వేటికవి వివరంగా సర్దుకునే అవకాశం లేనంత హడావుడిగా మారాం.

కొత్త యింట్లో సామానంతా పడెయ్యగానే, యేవో పనులు తరుముకొచ్చి యిల్లు తాళం పెట్టి వెళ్ళిపోయాం యిద్దరం.

తిరిగొచ్చేప్పుడు ముందు నేనొక్కదాన్నే వచ్చేశాను.

నాలుగు రోజులు శలవుపెట్టి యిల్లంతా పద్ధతిగా సర్దుకుందామనుకున్నా. 'ఇల్లు పద్ధతిగా పెట్టుకోలేదుగానీ దేశాన్ని చక్కబెడుతుందట' అనే మా అమ్మ వెక్కిరింతను అబద్ధం చేయాలనుకుంటాను యిల్లు మారిన ప్రతిసారీ-

అప్పుడు కూడా-యింటినిండా సామాన్లు పరిచివున్నాయి. గుడ్డల మూటలు, గిన్నెలు వేసి కట్టిన గోతాలూ, పుస్తకాల ప్యాకెట్లు-వున్న నాలుగు గదుల్లో సామానంతా కిక్కిరిసి వుంది. అటూ, యిటూ, యెటు వెళ్ళి నా కాళ్ళకు యేదో ఒకటి అడ్డం పడుతూ తడిచీరతో నడుస్తున్నట్లుగా వుంది. ఆ నడక నడవలేక, విసుగుపుట్టి సామాను సర్దేద్దామనుకున్నాను.

ఎక్కడ్నించీ మొదలు పెట్టాలి? ఆ గిన్నెలన్నీ గోతాల్లోంచి తీసి శుభ్రంగా కడిగి, తుడిచి వంటింట్లో సర్దాలంటే మాటలు కాదు. పోనీ పప్పు వుప్పులు పోసుకునే డబ్బాలు సర్దుదామా అంటే అవి మరీ ప్రమాదం- ఆ పప్పులు తీసి ఎండబెట్టి, ఈ డబ్బాలు కడిగి అరబెట్టి- మళ్ళీ పప్పులు అందులో పోసి- అదంతా ఒక్కరోజులో అయ్యేపని కాదు. ఈ ఒక్కరోజులో పూర్తి చేయగల పనైతే అదిచేసిన తృప్తితో రేపింకో పనికి వుత్సాహం వస్తుంది.

పుస్తకాలు సర్దుదామంటే నా ఒక్కదానివల్లా అయ్యేపని కాదది.

అన్ని వందల పుస్తకాలు అల్మరాల్లోకి యెక్కిస్తే గూళ్ళు పడిపోతాయి.

ఏం చేద్దాం? ఎక్కడ మొదలు పెడదాం అని అటు యిటూ తిరుగుతున్న నాకు ఉత్తరాలు పెట్టిన పాత సూట్‌కేసులు కన్పించాయి. ఒక్కసారి ప్రాణవాయువు నేరుగా రక్తంలోకి ఎక్కినట్లయింది.

ఉత్తరాల సూట్‌కేసులు తెరిచి, అన్నీ బైటపెట్టి, దుమ్ముదులిపి మళ్ళీ అవి పద్ధతిగా సూట్‌కేసులో సర్ది, సూట్‌కేసులు మంచం కిందకు నెడితే పనయిపోతుంది.

ఇది నాకు నేను చెప్పుకునే అబద్ధం. అసలు కోరిక, పాత వుత్తరాలు చదువుకోవాలనే

కోరిక, చిలవలూ, పలవలూ వేస్తూ నిలవరించుకోనీయకుండా నా లోపలంతా అల్లుకు పోతోంది. ముఖం మీద యింత ఆనందం, నవ్వు యింకెపుడన్నా వస్తాయా అన్నట్టు నిండిపోయాయి.

పాత వుత్తరాలు-కాదు మిత్రులు-నా స్నేహితులు-వాళ్ళందరితో ఒక్కసారిగా మాట్లాడటం.

ఎవరి ఉత్తరాలు ముందు చదవాలి? చిన్ననాటివా? ప్రేమలేఖలా, విప్లవోద్యమపు ఉత్తరాలూ? సందిగ్ధక్షణాల బాధా సందర్భపు ఉత్తరాలా? నా జీవన సాఫల్యపు లేఖలా-ఏవి?

ఎంచుకోవటమే సమస్య. కాలంలో ఎంత వెనక్కు వెళ్ళాలని నిర్ణయించుకోవటమే సమస్య.

మితిమీరిన ఉత్సాహంతో, యేది ముందు తెరవాలో తెలియని వుద్వేగ భరిత కుతూహలంతో ఆ స్నేహ సౌందర్య సీమల ముందు నిలబడి వున్నాను.

కాలింగ్ బెల్ మోగింది.

చాలా విసుగ్గా, నా ఆనందానికి కలిగిన ఆ అంతరాయాన్ని తన్నాలన్నంత చిరాకుగా వెళ్ళి తలుపు తీశాను.

ఎదురుగా సుబ్బారావు.

"ఎప్పుడొచ్చావు హైదరాబాదు?" నా చిరాకూ విసుగూ యెటో యెగిరిపోయాయి.

నా ప్రశ్నకు సమాధానం యివ్వకుండా నుంచున్న సుబ్బారావు వంక పరిశీలనగా చూశాను.

ముఖం చాలా వాడిపోయింది. కళ్ళు యెర్రగా వున్నాయి. యేదో జరిగింది.

"ఏమైంది? లోపలికిరా" వెనక్కు తిరగబోయాను.

"రాను వెళ్ళిపోతాను. ఒకసారి నిన్ను చూడాలని వచ్చాను. మళ్ళీ వస్తాను."

నాకు ఒక్కముక్కా అర్థం కాలేదు.

"మళ్ళీ వచ్చేవాడివి-వాకిట్లోవాడివి వాకిట్లోంచే వెళ్ళేట్టయితే- యివాళెందుకు వచ్చినట్టు?"

ఇలాంటి తిక్కపనులు చేయటం సుబ్బారావు తన జన్మహక్కనుకుంటాడు.

"ఎందుకొచ్చానంటే యివాళ రేపు కాదు."

నాకు ఒళ్ళు మండింది.

"ఔనా? ఎప్పుడు కనుక్కున్నావ్?" అడిగాను. గానీ సుబ్బారావు ముఖం చూస్తే యెందుకడిగానా అనిపించింది.

అది విషాదమా, దైన్యమా? మహాదుఃఖ భారంతో శూన్యమైన హృదయ ప్రతిఫలనమా?

అర్థం చేసుకోవటం నా వల్ల కాలేదు.

"చెప్పు సుబ్బారావ్. ఏమైంది? ఇవాళ రేపు కాకపోవటం యేమిటి?"

"ఇక మనకు కాలాన్ని చెప్పుకోటానికి కొత్తపదం వస్తోందిగా- కొత్త పదం" సుబ్బారావు నవ్వబోయి యేడ్చాడు. నేనతన్ని పట్టుకుని లోపలికి నడిపించబోయాను.

అతను కుదరనివ్వలేదు.

"చాలా మందిని చూడాలివాళ. రేపటినుంచీ సోవియట్ యూనియన్ పతనానికి ముందు, తర్వాత అని మాట్లాడుకుంటాం మనం. సర్వనాశనం జరిగిపోయింది. మనకు సంబంధించి, మన తరానికి సంబంధించి అంతా కాలి బూడిదై పోయింది. రేపట్నించీ నువ్వు వేరు. నీ వునికి వేరు. నీ అస్తిత్వం వేరు. అలాగే నేనూ- అందరూ- ప్రపంచం సమస్తం- ఇవాళ నా మిత్రులందరితో కలిసి యేడుస్తాను. ఐక్య పోరాటాలు చెయ్యలేకపోతే మానె, అందరితో కలిసి యేడవనన్నా యేడవొద్దా?"

దుఃఖాన్ని కంట్రోలు చేసుకున్నాడు.

"వస్తాను. మన స్వప్నాల్ని సమీక్షించుకుని యివాళ యేడువు. కరువుదీరా యేడువు. గుండెపగిలేలా యేడువు. దేన్నీ నీ యేడుపుకు అడ్డం రానీయకు. మన తరపు పాపాలన్నీ కడుక్కుపోతాయా అన్నట్లు యేడువు. యేడుస్తావు కదూ" అంటూనే స్కూటరెక్కి వెళ్ళిపోయాడు సుబ్బారావు.

నేనక్కడ అట్లా యెంతసేపు నిల్చున్నానో నాకు తెలియదు. కాళ్ళు బరువెక్కి, యిక నిలబడలేమని మొరాయించి, నన్ను లోపలికి తెచ్చి, ఒక విరిగిపోయిన కుర్చీలో కూలేశాయి. ఇది జరుగుతుందని తెలుసు. చాలా సంవత్సరాలుగానే తెలుసు. చివరికి జరిగిపోయింది. తెలిసినంత మాత్రాన విషాదం తగ్గుతుందా? మామయ్యకు ఐదేళ్ళ నుంచీ కేన్సరని తెలుసు. కానీ చనిపోయిన రోజు నన్నెవరు పట్టుకోగలిగారు?

సుబ్బారావు- అందరిలోనూ సుబ్బారావు వచ్చి చెప్పాడు.

విశాఖపట్నం సముద్రతీరంలో మేం కట్టినవన్నీ యిసుక మేడలని చిన్నపిల్లాడిలా

యేడుస్తూ చెప్పివెళ్ళాడు.

ఎప్పటెప్పటి జ్ఞాపకాలో తారాజువ్వల్లా కళ్ళముందు రంగులు విరజిమ్మి పోతున్నాయి.

లెనిన్, గోర్కీల రంగుల ఫోటోలు మొదటిసారిగా నాన్న యింటికి తెచ్చిన రోజు-

ఆ వెన్నెల రాత్రి వాళ్ళిద్దరి గురించీ నాన్న చెప్తుంటే ఒక అద్భుత కథలా విని వుప్పొంగిన రోజు-

గగారిన్ అంతరిక్షయానం చేశాడని చెప్తూ నాన్న మిఠాయిలు పంచిపెట్టి, ఆనందం పట్టలేక నన్ను పైకెగరేసి పట్టుకున్న రోజు.

వాలెంతీనా తెరెష్కోవాని గురించి విని ఒళ్ళంతా పులకరించి, నా గర్వాన్ని యేం చేసుకోవాలో తెలియక వెర్రిగా వీధులవెంట పరిగెత్తిన రోజు.

అమెరికాను హెచ్చరించి క్యూబామీద దాడిని సోవియట్ యూనియన్ ఆపించిన వార్త పేపర్లో చదివిన రోజు.

గోర్కీ 'అమ్మ' చదివిన రోజు.

ప్రపంచాన్ని కుదిపివేసిన పదిరోజులలో తన్మయురాలినైన రోజు.

అన్నీ కలల్లా కళ్ళముందుకి వచ్చి వెళ్ళిపోతున్నాయి.

ఈ కలలతో నాకూ, నా స్నేహితులకూ యెంత సంబంధముందో యెలా చెప్పను?

కొత్త ప్రపంచాన్ని చిన్నతనంనుంచీ పరిచయం చేసుకున్న తరంగా మేమందరం ఒక కొత్త సంబంధంలోకి వచ్చాం. ఇపుడా సంబంధం లేకుండా పోయింది. ఆ రోజు యేడ్చాను. నిజంగానే యేడ్చాను. ఒక్కదాన్నీ గుండెలు పగిలేలా యేడ్చాను. నా స్నేహాలన్నీ మరణించినట్లు యేడ్చాను.

ఇది చాలారోజుల నుంచీ అనుకుంటున్నదే అయినా, దానిమీద యిపుడు పెద్ద ఆశలేమీ లేకపోయినా, ఆ రోజు నా మనసుని కమ్మేసిన మహావిషాదం వాస్తవం.

పెద్ద ఆశలు లేకపోయినా ఒక చిన్న ఆశ మినుకు మినుకుమంటూ వుండేది. ఆ ఆశను యెలాగైనా పెంచి పెద్ద చేయాలను కోటానికీ అసలు ఆశనేదే లేకుండా తుడిచిపెట్టుకు పోవటానికీ యెంత పెద్ద తేడా వుంది!

ఆ చిన్న ఆశ యెంత పెద్ద విషయం. దాన్లో యెదురు చూడటానికి యెంతో వుంది. ఇపుడీ యిగిరిపోయిన ఆశలో శూన్యం తప్ప యేమీలేదు. అంతా అయిపోయింది. కడుక్కుపోయింది.

ఇప్పుడు మరణించింది నేను తిరస్కరించిన ప్రేమికుడే.

నేను లాభంలేదనుకుని చేయి వదిలిన ప్రియుడే.

కానీ- ఆ ప్రియుడి జ్ఞాపకాలు నా మనసులో యిన్నాళ్ళూ బతికే వున్నాయి.

కొత్త ప్రపంచం మీద ఆశ కల్పించిన తొలి ప్రియుడు మరణిస్తే అతని మరణంతో ఆ ప్రపంచాన్ని గురించిన ఆశ తుడిచిపెట్టుకు పోతుంటే యేడవక యేం చెయ్యను?

అతను జబ్బు పడితే బాధపడ్డాను. తనంత తను తాగుబోతై సకల వ్యసనాలనీ చేతులారా తెచ్చి పెట్టుకుంటున్నాడని అతన్ని తిట్టుకున్నాను. తిట్టాను. ఇక లాభం లేదని వొదిలేశాను. కానీ మనసులో అతని మీది ఆశ, ఆ తొలిప్రేమ, నివురు గప్పిన నిప్పులా, యెండ తగిలితే విచ్చుకోటానికి సిద్ధంగా వున్న వాడని ఊటీ పువ్వులా అట్లాగే వుందన్నది నిజం. ఇప్పుడతని మరణంతో అంతా సమాప్తమయింది. ఈ ముగిసిపోవటం భరించరానిదిగా వుంది. ఇక ఆ దిక్కు చూడటానికీ ఆలోచించటానికీ, తిట్టటానికీ, బాధపడటానికీ కూడా యేమీ లేదనుకుంటే ఆ శూన్యాన్ని భరించటం దుర్భరంగా వుంది. అది యెడారి అనుకున్నా, బీడు అనుకున్నా యేదో ఒకటి వుంది. మేమీ లేని శూన్యాన్ని మోయటం యెట్లా? శూన్యాన్ని మోయటం- ఎంత అర్థంలేని మాట- కానీ అది యిప్పుడు యదార్థమై అనుభవంలోకి వచ్చి గుండెలమీద కూర్చుంది.

దీన్ని యెట్లా దించను? దేంతో పూడ్చను? ఆరోజు ఇక ఉత్తరాలు చదవలేదు. దుమ్మయినా దులపకుండా అటక ఎక్కించాను.

ఆ తర్వాత ఐదారేళ్ళకు మాకో స్వంత ఇల్లు యేర్పడింది.

ఈ మహానగరంలో ఆకాశాన్నంటే సౌధాల్లో ఒక చిన్న ఫ్లాటు స్వంత మయింది. నేను తప్ప మిగిలిన వాళ్ళు చాలా సంతోషించారు. నాకేమీ ఆనందంగా లేదు. చాలా అలజడిగా ఆందోళనగా వుంది. ఇక నా భౌతిక జీవితంలో మార్పుండదనే భయం నన్ను పీడిస్తోంది. మరో పాతికేళ్ళు బతికితే ఆ పాతికేళ్ళూ ఈ నాలుగు గోడల్నే చూస్తూ బతకాలి. ఆ ఆలోచనను నేను భరించలేకపోతున్నాను.

ఆ స్వంత ఇంటికి మారాం. స్నేహితులెవర్నీ మా కొత్త ఇల్లు స్వంత ఇల్లు చూడండని పిలవలేదు.

"అమ్మయ్య, మాటిమాటికీ మారే మీ అడ్రసులతో చచ్చే వాళ్ళం. ఒక పర్మినెంటు అడ్రస్‌లోకి వచ్చారు. మంచిపని చేశారు." అని స్నేహితులంటుంటే తప్పు చేసినట్లు తలవంచుకుంటున్నా.

స్వంత ఇల్లు, స్వంత ఆస్తి ఎంత అర్థవిహీనమైన పదాలనుకున్నవి యెంత అనివార్యంగా జీవితంలోకి వచ్చేశాయో-

కానీ యిప్పటికీ ఈ పదాలకు అర్థమేముంది? ఈ పరాయీకరణ ప్రపంచంలో, ఈ తాకట్టుపడిన దేశంలో, వేలానికి దేశం సిద్ధమవుతున్న కాలంలో-

స్వంత ఇల్లు.

మనం నమ్మిన విషయాలన్నీ దూరమవటంలో అంతా మన బాధ్యతేనా?

సామాజిక చలనాన్ని నిర్దేశించలేకపోయిన మన అశక్తతేనా?

ఇప్పుడీ ఉత్తరాల్ని ఏం చెయ్యాలి? బహుశ యిక యిళ్ళు మారను. ఈ యింట్లోనే జీవితం ముగుస్తుంది. ఇళ్ళు మారేటపుడన్నా వీటిని తాకి, చదివి అనుభూతి చెందేదాన్ని. ఇప్పుడు ఆ అవకాశం కూడా లేదు. మళ్ళీ ఎప్పుడు చదువుతాను ఈ ఉత్తరాలు?

నేను చచ్చిపోయిన తర్వాత నాతోపాటు వాటిని కాల్చేయండని పిల్లలతో చెప్పటం తప్ప నేను చేయ గలిగింది లేదు. ఆ రోజు కోసం ఆ ఉత్తరాలు కూడా యెదురు చూస్తూ వుండాలా?

కాదు - అట్లా జరగకూడదు.

"స్వంత యింట్లోంచి కూడా మారగలం కదూ" అతనితో అన్నాను.

నవ్వుతున్నాడు.

"నిజంగా నేను మారతాను."

"తప్పకుండా - ఈ యింటిమీద లోన్లు తీరిపోయాక, ఒక పిల్లల సినిమా తీద్దాం. అప్పుడెలాగూ మారతాం"

"మనం తప్పకుండా ఈ ఇల్లు మారిపోతాం. అందుకే ఈ ఉత్తరాలన్నీ జాగ్రత్తగా దాచిపెడుతున్నా." నాకెంతో రిలీఫ్‌గా ఉంది.

"ఏదో ఒకటి చేద్దాం. జడపదార్థాల్లా స్వంత ఇంట్లో మగ్గిపోవద్దు. మార్పు కావాలి" అతని మాటల్లో ఉత్సాహం వచ్చింది.